సాక్షి అనకాపల్లి

బుధవారం । 27 । ఆగస్టు । 2025



శ్రావ్యంగా గాత్ర కచేరి

విశాఖ: కళాభారతి వార్షిక సంగీత, నృత్య, నాటకోత్సవాల్లో బెంగళూరు బ్రదర్స్ హరిహరన్, అశోక్ గాత్రయుగళం అలరించింది.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు శేషవస్త్రాలు అందించారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఉద్యోగులకు మంగళవారం ఉచితంగా మట్టి విగ్రహాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతి ఇంటిలోను ప్రతిష్ఠించి పూజలు చేయాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.వి. ముంకర, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద స్థాయికి చేరువలో 'పెద్దేరు'

అధికారులు అప్రమత్తం

మాడుగుల: పెద్దేరు జలాశయంలో మంగళవారం వరద నీటి ఇన్‌ఫ్లో 600 క్యూసెక్కులకు పెరగడంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధాన గేటు ద్వారా 520 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.60కి చేరుకుంది. పెద్దేరు ఏటి బాధిత గ్రామాలైన జంపెన, జేడీపేట, వీరవల్లి, పోతనపూడి, వీరనారాయణం, తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు పెద్దేరు నదిలో ఒక వారం రోజులు దిగరాదని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

కోనాంలోకి భారీగా ఇన్‌ఫ్లో



జలాశయం గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

చీడికాడ: కోనాం జలాశయంలోకి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరడంతో జలాశయం నీటిమట్టం ఒక్కసారిగా పెరుగుతోంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు జలాశయం ఎగువన కురిసిన అల్పపీడన వర్షాలతో ఆదివారం వరకు 160 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి 960 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయం నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి మంగళవారం సాయంత్రానికి 99.05 మీటర్లకు చేరుకుంది. ప్రమాదస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా 100 మీటర్లకు చేరుకోగానే నీటి విడుదలను పెంచనున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం దిగువకు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు.

పార్వతీ తనయా.. నీకు మొక్కెదన్



అనకాపల్లి టౌన్: వేల్పులవీధిలో తుది మెరుగులు దిద్దుకుంటున్న వినాయకుడి విగ్రహం



చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడి మూల విరాట్



అనకాపల్లి టౌన్: వర్షాల వల్ల బేరం లేక దిగులుగా కూర్చున్న వినాయకుని బొమ్మల వ్యాపారులు



అనకాపల్లి టౌన్: వర్షంలో పూజ సామగ్రి కొనుగోళ్లు

సాక్షి, అనకాపల్లి: తొలి పూజలందుకునే ఆదిదేవుడు.. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు.. పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన పార్వతీ తనయుడు విఘ్నేశ్వరుడు. వినాయక చవితి వచ్చిందంటే ఊరూరా ఒకటే సందడి. ఇళ్లలో పూజలు.. వీధుల్లో మండపాలు.. వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలు.. ఒకటి రెండు రోజులు కాదు ఏకంగా తొమ్మిది రోజులపాటు సాగే సంబరమిది. ఈ ఏడాది ఘనంగా గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు జిల్లా అంతటా విస్తృత ఏర్పాట్లు చేశారు. చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం, నక్కపల్లి మండలంలో ఒడ్డిమెట్ట లక్ష్మీ గణపతి గుడి, అనకాపల్లిలో చింతామణి గణపతి దత్త క్షేత్రం జిల్లాలో ప్రసిద్ధమైన ఆలయాలు. ఇక్కడ జరిగే వేడుకలతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వినాయక పందిళ్లలో నెలకొనే సందడి అంతా ఇంతా కాదు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో 126 అడుగుల వినాయక విగ్రహం, వేల్పుల వీధిలో 30 అడుగుల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుల నుంచి నిర్వాహకులు అనుమతులు పొందారు. గణేష్ ఉత్సవాలను ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా శాంతియుతంగా నిర్వహించుకునేందుకు పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు. ఉత్సవాల నిర్వహణలో అల్లర్లకు కమిటీలదే బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగు డాన్సులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు.

బియ్యపు గింజ మీద బుజ్జి గణపతి

మాడుగుల రూరల్: తన ప్రతిభతో ఎన్నో అపురూపాలను ఆవిష్కరించిన సూక్ష్మ కళాకారుడు నెయ్యిదొండ గోపాల్ ఈసారి బియ్యపు గింజ మీద బుజ్జి గణపతిని చిత్రీకరించారు. ఎం.కోడూరు గ్రామానికి చెందిన గోపాల్ ఐదు గంటల పాటు శ్రమించి, ఈ ఘనత సాధించారు. చూడముచ్చటగా ఉన్న వినాయకుడిని చూసి అందరూ ముగ్ధులవుతున్నారు.



బియ్యపు గింజ మీద గణనాథుడిని చిత్రించిన నెయ్యిదొండ గోపాల్



అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న 126 అడుగుల విగ్రహం

వర్షాన్ని తగ్గించు విఘ్నేశుడా..

అనకాపల్లి టౌన్: చవితి సందడికి వర్షం బ్రేకులు వేసింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పూజా సామగ్రి, వినాయకుని బొమ్మలు విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న వ్యాపారులు డీలా పడ్డారు. సాయంత్రానికి కాస్త తెరిపి ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురుచూస్తున్న జనం కూడా ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేయడంతో సందడి నెలకొంది.

టిప్పర్లతో తిప్పలు

- ఇరుకు రోడ్లపై అధిక లోడుతో క్వారీ వాహనాల రాకపోకలు
- సందట్లో సడేమియాలా మామూళ్లలో వాటా కోసం 'కూటమి' ప్రజాప్రతినిధుల పాకులాట



ఈనెల 23న కోటవురట్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్న వాహనాలు

సాక్షి, అనకాపల్లి: రోలుగుంటలో గల క్వారీల నుంచి బండరాళ్ల భారీ లోడు టిప్పర్లు కోటవురట్ల–అడ్డురోడ్డు మీదుగా రాంబిల్లి నేవల్‌బేస్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా భారీ వాహనాలు వేగంగా తిరగడంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దీనికి తోడుగా నర్సీపట్నం–అడ్డురోడ్డు మార్గంలో ప్రయాణించే రోడ్డు ఇరుకుగా ఉండడం, ఇండేసమ్మ వాక ఘాట్ రోడ్డు శిథిలావస్థలో ఉండడంతో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. పరిమితికి మించి అధికలోడు వాహనాలు వెళ్లడంతో ఎపుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని కలవరపడుతున్నారు. రోజు కు 40కు పైగా టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

మూడు వారాలుగా మారిన రూట్

ఈనెల 3వ తేదీ వరకు రోలుగుంట క్వారీల నుంచి అధికలోడు వాహనాలు మాకవరపాలెం మీదుగా తాళ్లపాలెం.. ఏలేరు కాలువ బ్రిడ్జి మీదుగా రాంబిల్లి నేవల్ బేస్‌కు రాకపోకలు సాగించేవి. అయితే మాకవరపాలెంలో గల పయనీరు అల్యూమినియం కంపెనీ లక్ష్యంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు జూలై 30వ తేదీన రాజుపేట వద్ద లారీలను అడ్డుకున్నారు. అధికలోడు వాహనాల కారణంగా బ్రిడ్జి కూలిపోతుందని చిటపటలాడారు. అయితే అల్యూమినియం కంపెనీ లారీలనేనా అడ్డుకుంటారు.. ఇదే మార్గంలో రోలుగుంట క్వారీ వాహనాలు కూడా వెళుతున్నాయి.. వాటిని ఎందుకు అడ్డుకోలేదంటూ ఈనెల 3వ తేదీన తాళ్లపాలెం సంత వద్ద రోలుగుంట క్వారీలకు సంబంధించిన టిప్పర్లను లారీ యూనియన్ నాయకులు అడ్డుకున్నారు. 40 కిలోలకు మించి ఉన్న అధిక లోడు లారీలు వెళ్లడానికి వీల్లేదంటూ అభ్యంతరం చెప్పారు. దీంతో రవాణా శాఖ అధికారులు మాకవరపాలెం దాటిన తరువాత చెక్ పోస్టుకు ఏర్పాటు చేశారు. మాకవరపాలెం మీదుగా వెళ్లనివ్వకపోవడంతో రోలుగుంట క్వారీల నుంచి బండరాళ్ల టిప్పర్లను కోటవురట్ల మీదుగా అడ్డురోడ్డు నుంచి రాంబిల్లి నేవల్ బేస్‌కు తరలిస్తున్నారు. నర్సీపట్నం నుంచి కోటవురట్ల మీదుగా అడ్డురోడ్డు వరకూ ఇరుకు రోడ్డు, ప్రమాదకరంగా శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి ఉన్నాయి. ఈ మార్గంలో అధికలోడు క్వారీ బండ రాళ్ల వాహనాలు రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రహదారి కెపాసిటీకి మించి తమను ఎవరూ ఏం చేయలేరన్న ధైర్యంతో అయ్యన్న అండతో లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలను తిప్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నా మామూళ్లు ఏవీ..!

ఈనెల 3వ తేదీన తాళ్లపాలెం వద్ద లారీ యూనియన్ వారు రోలుగుంట నుంచి వచ్చే క్వారీ లారీలను నిలిపివేయడంతో కోటవురట్ల మీదుగా తొలి నాలుగు రోజులు భారీ వాహనాలు బాగానే తిరిగాయి. తరువాత నిలిపివేయాలని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఒకరోజు రాకపోకలు సాగలేదు. మళ్లీ రెండు వారాలపాటు రాకపోకలు యథేచ్ఛగా సాగాయి. ఈనెల 23వ తేదీన కోటవురట్లలో నాలుగు క్వారీ బండరాళ్ల టిప్పర్లను పోలీసులు పరిమితి మించి లోడు ఉందని అదుపులోకి తీసుకున్నారు. వాటిపై కేసు నమోదు చేసి రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. అసలు విషయమేమిటంటే.. 'నర్సీపట్నం ప్రజాప్రతినిధికేనా..? మా నియోజకవర్గంలో నుంచే వాహనాలు వెళుతున్నాయి.. మా మామూళ్ల సంగతేమిటి..? ఇవ్వకపోతే ఇలానే వాహనాలు నిలిచిపోతాయం'టూ రోలుగుంట క్వారీల యజమానులను హెచ్చరించినట్లు సమాచారం.

టన్నుకు రూ.40ల చొప్పున రోజుకు రూ.2.4 లక్షలు వసూలు

రోలుగుంటలో పర్మిట్ ఉన్న నాలుగు క్వారీల నుంచి నర్సీపట్నానికి చెందిన టీడీపీ సీనియర్ ప్రజాప్రతినిధికి టన్నుకు రూ.40 చొప్పున మామూళ్లు అందుతున్నట్లు సమాచారం. ఒక్కో లారీలో 50 టన్నులకు పైబడి బండరాళ్ల లోడు వెళుతుంది. రోజుకు సగటున 40 లారీలు రెండు నుంచి మూడు ట్రిప్‌లు తిరుగుతాయి. ఒక్కో ట్రిప్‌కు రూ.2 వేలు చొప్పున ఒక్కో లారీ నుంచి రోజుకు రూ.6 వేలు వసూలు చేస్తారు. ఇలా రోజుకు రూ.2.4 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు భోగట్టా.

గంజాయి కార్యకలాపాలపై గట్టి నిఘా

- 1700 మంది అనుమానితుల బైండోవర్
- గంజాయి సేవించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు
- విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టి



కశింకోట పోలీసు స్టేషన్ రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

కశింకోట: విశాఖపట్నం రేంజ్ పరిధిలో గంజాయి సమూల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. కశింకోట పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరును, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో గంజాయి సాగు చేసేవారు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ప్రోత్సాహకాలు కల్పించి జీవనోపాధికి చర్యలు తీసుకున్నామన్నారు. ఒడిశా నుంచి మన రాష్ట్రం మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా కాకుండా పలుచోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పోలీసు నిఘా పెంచామన్నారు. రేంజ్ పరిధిలో సుమారు 1700 మంది అనుమానితులను బైండోవర్ చేశామన్నారు. గంజాయి సేవించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పరిశీలిస్తున్నామన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్స్ గుర్తించి సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ ఎం.శ్రావణిలను ఆదేశించారు. కశింకోట, తాళ్లపాలెం కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించడానికి సిగ్నల్స్ ఏర్పాటు గాని, ప్రత్యామ్నాయ చర్యలు గాని చేపట్టడానికి సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని ఎస్పీని ఆదేశించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమై గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు. సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్ స్టే యాప్‌కు చిక్కిన గంజాయి నిందితుడు



గంజాయి కేసులో నిందితుడు చిన్నారావుతో ఎస్సై రామకృష్ణారావు

రోలుగుంట/నర్సీపట్నం: సేఫ్ స్టే యాప్ ద్వారా గంజాయి నిందితుడు పోలీసులకు చిక్కాడు. నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు, రోలుగుంట ఎస్సై రామకృష్ణారావు అందించిన వివరాలు.. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు హోటల్స్, లాడ్జిల్లో సేఫ్ స్టే యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. వారికి కేటాయించిన లాగిన్ ఐడీలో హోటల్స్, లాడ్జిలకు వచ్చే వారి వివరాలను నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ యాప్‌లో వివరాలు జిల్లా ఐటీ కోర్ టీమ్‌కు వెళ్తాయి. అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం, బచ్చింత గ్రామానికి చెందిన గెమ్మెలి చిన్నారావు రోలుగుంట పోలీసు స్టేషన్‌లో 2024లో నమోదైన గంజాయి కేసులో నిందితుడుగా ఉన్నాడు. మంగళవారం నిందితుడు నర్సీపట్నం పాలిమర్ హోటల్లో రూమ్ అద్దెకు తీసుకున్నాడు. అతని వివరాలు యాప్‌లో నమోదు కావడంతో ఐటీ కోర్ టీమ్ అప్రమత్తమైంది. అతడు గంజాయి కేసులో తప్పించుకొని తిరుగుతున్న నిందితుడని గుర్తించి, ఆ సమాచారం పోలీసులకు చేరవేసింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, రోలుగుంట పోలీసులకు అప్పగించామని సీఐ గోవిందరావు తెలిపారు. రోలుగుంటలో ఎస్సై పి.రామకృష్ణారావు నిందితుడిని ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 78 కేజీల గంజాయితో దొరికిన ముగ్గురిలో అప్పట్లో ఇద్దరిని అరెస్టు చేయగా, మూడో నిందితుడు చిన్నారావు పరారీలో ఉన్నాడని, యాప్ వల్ల ఇన్నాళ్లకు చిక్కాడని వివరించారు.

బార్ అండ్ రెస్టారెంట్ దరఖాస్తుకు గడువు పెంపు

అనకాపల్లి: నూతన బార్ విధానంలో భాగంగా జీవీఎంసీ, నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాల్టీల పరిధిలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 29వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి వి.సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.5 లక్షల నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుము, రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తును ఆన్‌లైన్‌లోగాని, ఆఫ్‌లైన్‌లోగాని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి అందజేయాలని ఆయన కోరారు. ఈనెల 30వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీస్తామన్నారు.

కుమార్తెలు, మరిదే హంతకులు

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- ఆస్తి తగాదాలే కారణం
- వెల్లడించిన అనకాపల్లి ఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా, వెనుకన నిందితులు

అనకాపల్లి: గాజువాక మండలం, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బంకిళ సంతు(37) హత్య కేసు మిస్టరీ వీడింది. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలతోపాటు కుటుంబానికి చెడ్డ పేరు తీసుకొస్తోందన్న అనుమానంతో ఆమెను ఇద్దరు కూతుళ్లు, మరిది హతమార్చినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కూర్మన్నపాలెం, దువ్వాడ, రాజీవ్‌నగర్‌కు చెందిన బంకిళ సంతు, ఇద్దరు కుమార్తెలు అనూష, మైనర్ కుమార్తె, మరిది మురళీధర్‌లు కలిసి ఉంటున్నారు. సంతు భర్త ఖతర్‌లో ఉద్యోగ రీత్యా ఉన్నాడు. సంతు కుటుంబంలో ఆస్తి తగాదాలు, ఆర్థిక సమస్యలపై తరచూ వివాదాలు పడుతున్నారు. భార్యాభర్తల మధ్య దాంపత్య బంధం సరిగా లేకపోవడంతో భర్త ఖతార్ వెళ్లిపోయాడన్న ఆరోపణలున్నాయి. గతంలో భర్తపై సంతు పోలీస్ కేసు కూడా పెట్టింది. ఇద్దరు కూతుళ్లతోనూ కొంతకాలంగా గొడవలు పడుతోంది. గతంలో ఆస్తిని కూడా అమ్మకాలు చేశారు. ఈ విషయంపై కూర్మన్నపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఆస్తి అమ్మగా వచ్చిన సొమ్మును సంతు దుర్వినియోగం చేసి, కుటుంబానికి చెడ్డపేరు తీసుకొస్తోందని ఇద్దరు కూతుళ్లు, మరిది కోపంతో ఉన్నారు. ఈ నెల 13న చిన్న కూతురు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చింది. తల్లికి చెందిన సెల్‌ఫోన్ చూడగా అసభ్యకరమైన ఫొటోలు, కాల్ రికార్డులు చూసి షాక్‌కు గురై అక్కడే ఉన్న అక్క అనూషకు తెలిపింది. కూతుళ్లు, మరిది కలిసి సంతును ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారు. ఇంట్లో నిద్రిస్తున్న సంతును ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు కూతుళ్లు, మరిది హత్య చేశారు. 14వ తేదీ తెల్లవారుజామున మురళీధర్ స్నేహితుడైన మోహన్ కారులో మృతదేహాన్ని దువ్వాడ మీదుగా సబ్బవరం మండలం వేట జంగాలపాలెం గ్రామానికి తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. సెల్‌ఫోన్ డేటా ఆధారంగా సంతు హత్య కేసును ఛేదించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందిని ప్రశంసా పత్రాలతో ఎస్పీ అభినందించారు. సమావేశంలో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ విష్ణుస్వరూప్, సబ్బవరం సీఐ రామచంద్రరావు, సీసీఎస్ సీఐ అప్పలనాయుడు, ఎస్ఐలు సింహాచలం, ప్రసాదరావు, రామకృష్ణ, రమేష్, స్టేషన్ సిబ్బంది శ్రీనివాసరావు, సతీష్ కుమార్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

300 ఏళ్ల నాటి కార్యసిద్ధి గణపతి | 2లో

వైద్యకళాశాలకు ప్రాణం పోయండి

- ఉత్తరాంధ్ర ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ
- నిలిచిన కళాశాల భవనాల సందర్శన



అసంపూర్తిగా ఉన్న కళాశాల భవనాలను పరిశీలిస్తున్న అజశర్మ, తదితరులు

మాకవరపాలెం: వైద్య కళాశాల నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే పునః ప్రారంభించాలని ఉత్తరాంధ్ర ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. మండలంలోని భీమబోయినపాలెం వద్ద గత ప్రభుత్వం 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కళాశాల భవనాల నిర్మాణం నిలిపివేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉత్తరాంధ్ర ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు అసంపూర్తిగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల భవనాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంతోపాటు ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ఇక్కడ నిర్మించే వైద్య కళాశాల ద్వారా సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం వారంతా విశాఖ కేజీహెచ్‌కు వ్యయ, ప్రయాసలకోర్చి వెళ్లాల్సివస్తోందన్నారు. ఈ కళాశాల భవనాలు అసంపూర్తిగా ఉండటం వలన ఇప్పటికే వెచ్చించిన నిధులు వృథా అవుతాయన్నారు. ఏ ప్రాంత అభివృద్ధిలోనైనా ప్రధాన పాత్ర పోషించేది విద్య, వైద్యం అన్నారు. రాష్ట్రం, దేశంలో ఉన్నత విద్య, వైద్య విద్య సౌకర్యాలు లేక డాక్టర్ చదువులకు ఇతర దేశాలకు వెళ్లాల్సివస్తోందన్నారు. భీమబోయినపాలెం వద్ద కళాశాల భవన నిర్మాణాలు ఆపివేసి, సామగ్రిని అమరావతి తరలించారన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు తలపెట్టిన కళాశాలలను అర్ధంతరంగా నిలిపివేయడం సరికాదన్నారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో ఒక్క ప్రభుత్వ ఇంజినీరింగ్, మెడికల్ కళాశాల లేదన్నారు. ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ మెడికల్ కళాశాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి, వివిధ విభాగాల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ పిన్ సరిచేస్తుండగా మంటలు

మునగపాక: గ్యాస్ సిలిండర్ పిన్ తెరిచే క్రమంలో పక్కనే ఉన్న కట్టెల పొయ్యి నుంచి మంటలు చెలరేగిన ఘటన మండలంలోని చూచుకొండలో జరిగింది. చూచుకొండకు చెందిన కాండ్రేగుల సత్యనారాయణ భార్య అప్పారావమ్మ ఇంటిలో గ్యాస్ స్టౌ వెలిగించే క్రమంలో మంట రాకపోవడంతో సిలిండర్ పిన్‌ను తెరిచేందుకు ప్రయత్నించింది. ఎంతకూ పిన్‌లు రాకపోవడంతో సమీపంలోని మెకానిక్ హేమసుందర్‌ను ఆశ్రయించారు. అతను పిన్‌ను సరిచేస్తుండగా పక్కనే మండుతున్న కట్టెల పొయ్యి నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో మెకానిక్ హేమసుందర్‌కు గాయాలయ్యాయి. దంపతులిద్దరూ బయటకు పరిగెత్తడంతో సురక్షితంగా బయటపడ్డారు. గాయాలపాలైన హేమసుందర్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లిలోని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


రెడ్డి మాధురి (ఫైల్)

అచ్యుతాపురం రూరల్: కుమారపురం గ్రామానికి చెందిన రెడ్డి మాధురి (25) రాయ్‌పూర్ ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డి మాధురి అంగన్‌వాడీ కార్యకర్తగా కుమారపురంలో విధులు నిర్వహిస్తుంది. గత జూన్ 26న అచ్యుతాపురం కూడలికి సమీపంలో పిరమిడ్ వాటర్ ప్లాంట్ దగ్గర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైందన్నారు. విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నెల రోజులు చికిత్స పొంది అనంతరం మెరుగైన వైద్యం కోసం రాయ్‌పూర్ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు. మృతురాలు ప్రమాదం జరిగిన సమయంలో గర్భిణి, చికిత్స సమయంలో నెలలు నిండడంతో ఆపరేషన్ చేసి మగ శిశువుకు జన్మనివ్వగా రెండు రోజుల వ్యవధిలో ఆ పసిపిల్లడు కూడా మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు అరకు వరకే కిరండూల్ పాసింజర్

తాటిచెట్లపాలెం: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా, ప్రయాణికుల భద్రత దృష్ట్యా విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం(58501/58502)ప్యాసింజర్ రైలును బుధవారం అరకు వరకు మాత్రమే నడిపిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు అరకు–కిరండూల్ మధ్య రాకపోకలు సాగించదు. ప్రయాణికులు గమనించాలని సీనియర్ డీసీఎం కోరారు.

300 ఏళ్ల నాటి కార్యసిద్ధి గణపతి

చోడవరం క్షేత్రంలో విశిష్ట స్వయంభూ విఘ్నేశుడు


చోడవరం స్వయంభూ ఆలయానికి కొత్తగా నిర్మించిన మూడు రాజగోపురాలు


చింతామణి గణపతి ఆలయం(అంతర చిత్రం) చింతామణి గణపతి

చోడవరం: చోడవరం గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకుని తూర్పుదిశగా ఉన్న శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం ఉంది. సుమారు 300 ఏళ్లనాటి చరిత్ర కలిగిన ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ విఘ్నేశ్వరుని విగ్రహం నడుము పైభాగం మాత్రమే దర్శనమిస్తుంది. స్వామివారి తొండం చివరిభాగం పైకి కనిపించదు. ఈ విగ్రహం ఏటేటా పెరుగుతుందనే ప్రతీతి ఉంది. పాతచెరువు ఒడ్డున ఉన్న ఈ స్వయంభూ వినాయకుని విగ్రహాన్ని పక్కనే ఉన్న శ్రీ స్వయంభూ గౌరీశ్వరాలయంలోకి తరలించడానికి అప్పట్లో తవ్వకాలు జరిపించగా ఎంతపాడవు తవ్వినా స్వామివారి తొండం చివరి భాగం కనిపించకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్టు పూర్వీకులు చెబుతారు. తవ్వకాన్ని జరిపిన ప్రాంతాన్ని 'ఏనుగుబోదె'గా పిలుస్తుంటారు. ఒకనాడు జీర్ణావస్థలో ఉన్న ఈ స్వయంభూ విఘ్నేశ్వరాలయాన్ని 1856లో చుండూరు వెంకన్న పంతులు ఆధ్వర్యంలో కొడమంచిలి చలపతిరావు అర్చకత్వంలో పునఃసంప్రోక్షణ జరిపారు. 1875లో కొడమంచిలి గణేష్, పలువురు కలసి స్థాపించిన శ్రీ బాలగణపతి సంఘం సహకారంతో ఈ ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. దేవదాయ ధర్మదాయశాఖ ఆధీనంలో స్వామి వారికి పూజలు జరుగుతూ పుణ్యక్షేత్రంగా విరజిల్లుతుంది. ఇప్పటి వరకు ఆలయానికి ఉత్తర రాజగోపురం మాత్రమే ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ధర్మశ్రీ చొరవతో ఆలయానికి రూ.3కోట్ల వ్యయంతో తూర్పు, పశ్చిమం, దక్షిణ రాజగోపురాలు నిర్మించారు. ఈనెల 27 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుతారు.

చింతామణి గణపతి దత్తక్షేత్రం

అనకాపల్లి: సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో స్వామివారి నవరాత్రులు ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చింతామణి గణపతి ఆలయం భారతదేశంలోనే ఏకైక అతిపెద్ద గణపతి ఆలయంగా అనకాపల్లి మండలం జీవీఎంసీ విలీనగ్రామైన జాతీయ రహదారి సిరసపల్లి గ్రామంలోప్రసిద్ధి పొందింది. జాతీయ రహదారి తాడి రైల్వే స్టేషన్ సమీపంలో స్వామివారి ఆలయం ఉంది. చింతామణి గణపతిని ధ్యానించినా, పూజించినా, స్మరించినా లేదా దర్శించినా కోరిన వరాలు ఇచ్చే దైవంగా భక్తుల విశ్వాసం. అవదూత దత్త పీఠాధిపతి పరమపూజ్య గణపతి సచ్చిదానంద స్వామీజీ అమృత హస్తాలతో 2012 జనవరి 25వ తేదీన విగ్రహ ప్రతిష్ట చేశారు. ప్రతి ఏడాది వినాయక నవరాత్రులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఏనుగు తొండంలో చూడముచ్చటగా...


నాతవరం: ఆకట్టుకునే రీతిలో వినాయకుడి ఆలయం

నాతవరం: జిల్లేడుపూడి పంచాయతీలో మర్రిచెట్టు ఊడల మధ్యలో సర్వాంగసుందరంగా నిర్మించిన నూకాలమ్మ ఆలయానికి ఎడమవైపు ఏనుగు నోటిలోంచి కన్పించే విధంగా చూడముచ్చటగా వినాయకుడి ఆలయం ఉంటుంది. అమ్మవారికి కుడి వైపున 30 ఎత్తులో నాగసర్పంతో కూడిన శివలింగం ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ దట్టమైన అటవీప్రాంతంలో తాటాకు పాకలో నూకాలమ్మ తల్లిని ఈ ప్రాంతీయులు పూజించేవారు. ఏలేరు కాలువ నిర్మించే సమయంలో నాతవరం మండలం జిల్లేడుపూడిలో ఎత్తయిన కొండ అడ్డుగా ఉండడంతో అక్కడ సొరంగం తవ్వాలని నిర్ణయించారు. సొరంగం పనులు చేస్తుండగా యంత్రాలు మొరాయిస్తున్నాయి..కూలీలు మరణిస్తున్నారు..పనులు జరగడం లేదు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో స్థానిక పశువుల కాపరి సూచన మేరకు కాంట్రాక్టర్ ప్రభాకర్ చౌదరి మరుసటి రోజు తాటాకు పాకలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. సొరంగం పూర్తయితే ఆలయ నిర్మాణం చేస్తామని మొక్కుకున్నారు. దీంతో అనుకున్న సమయం కంటే ముందుగానే సొరంగం పనులు పూర్తి చేసి స్టీల్‌ప్లాంటుకు నీరు సరఫరా చేసేశారు. అన్నమాట ప్రకారం అలయాలు సర్వాంగసుందరంగా నిర్మించి ప్రతి ఏటా పండగలు చేస్తున్నారు. ఇటీవల ఆలయ నిర్మాణకర్త ప్రభాకర్ చౌదరి మరణించడంతో జిల్లేడుపూడికి చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు పండగలు చేస్తున్నారు. వినాయకుడి ఆలయం ఈ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా ఏనుగు తొండలోంచి కనిపించేలా నిర్మించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

భక్తులకు సదుపాయాలు

గణపతి నవరాత్రులకు ప్రతిరోజు సుమారుగా వెయ్యిమంది భక్తులు దర్శించుకుంటారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక మౌలిక సదుపాయలు కల్పించడం, స్వామి దర్శనం కల్పించడం జరుగుతుంది. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుంది.

–ఎం.ఆంజనేయరాజు, నిర్వాహకుడు,చింతామణి గణపతి దత్తక్షేత్రం

11సార్లు ప్రదక్షిణ చేస్తే కార్యసిద్ధి

భక్తులు తమ కోర్కెలు నెరవేర్చుకునేందుకు స్వయంభూ విఘ్నేశ్వరస్వామికి 11సార్లు ప్రదక్షిణ చేస్తే ఆ కార్యసిద్ధి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ ఆలయానికి మొదటిసారిగా వచ్చిన భక్తులు ఆలయ గర్భగుడి చుట్టూ 11సార్లు ప్రదక్షిణ చేసి కోర్కెలు తీరిన తర్వాత 48 సార్లు ప్రదక్షిణ చేయడం విశేషం. నవరాత్రి మహోత్సవాల్లో స్వయంభువుని దర్శించుకోవడం మరింత శుభకరం.

–కొడమంచిలి చలపతిరావు, చోడవరం స్వయంభూ వినాయక ఆలయ ప్రధాన అర్చకుడు

వంద శాతం వైకల్యం ఉంటే రూ.15 వేలు పింఛను


వందశాతం వైకల్యం ఉన్న దివ్యాంగుడిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి హైమావతి

ఎస్.రాయవరం: వందశాతం వికలత్వం ఉన్నవారికి రూ.15 వేలు వికలాంగ పింఛను అందజేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి అన్నారు. సర్వసిద్ధి గ్రామాన్ని మంగళవారం డీఎం అండ్‌హెచ్‌వో అకస్మికంగా తనిఖీ చేశారు. సర్వసిద్ధి గ్రామానికి చెందిన కందలాడ రాజు పుట్టినప్పటి నుంచి మంచానికి పరిమితం అయినప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేలు ఇవ్వడం లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి నేరుగా బాధిగుడి వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. దివ్యాంగుడికి రూ.15 వేలు పింఛనుకు అర్హుడని, త్వరలో మంజూరు అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌వో వెంట సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి, సిబ్బంది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత, భద్రతా చర్యలు

- వార్డెన్లు శ్రద్ధ తీసుకోవాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

తుమ్మపాల: వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో అన్ని రకాల పరిశుభ్రత, భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు ఆదేశించారు. వసతి గృహాల పరిశుభ్రత, ప్రవేశాలు, పిల్లల భద్రతా ప్రమాణాలు వంటి అంశాలపై కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారం కలుషితం కాకుండా హాస్టల్ వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి, విద్యార్థులను పూర్తి సురక్షిత భవనాలలో ఉంచాలన్నారు. ప్రతి 15 రోజులకు వాటర్ ట్యాంకులు శుభ్రపరిచి, క్లోరినేషన్ తప్పక చేయాలన్నారు. దోమ తెరలు అన్ని కిటికీలకు తప్పక ఉండాలని, లేని చోట వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు అందించాలని, ప్రథమ చికిత్స కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి నెలా మెడికల్ స్క్రీనింగ్ క్రమం తప్పకుండా చేసి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. బాలికల వసతి గృహాలు, ప్లస్ టూ వసతి గృహాల్లో నైట్ వాచ్‌మెన్లు విధిగా పరిస్థితులు గమనించాలన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల, సాంఘిక, గిరిజన సంక్షేమ అధికారులు కె.శ్రీదేవి, రామనందం, మంగవేణి పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


బైక్‌పై గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డ నిందితులతో ఎస్ఐ ధనుంజయ్

కె.కోటపాడు: రెండు కిలోల గంజాయిని బైక్‌పై తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ మంగళవారం పట్టుకున్నారు. కె.కోటపాడులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అటుగా బైక్‌పై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్న ఇద్దరి వ్యక్తులను పట్టుకున్నారు. వీరు పోలీసుల నుంచి పారి పోయేందుకు యత్నించగా సిబ్బందితో కలిసి ఎస్ఐ ధనుంజయ్ పట్టుకున్నారు. వారు కాకినాడ జిల్లాకు చెందిన చెక్క దుర్గా ప్రసాద్, వనుమూడి జానకిరామ్‌గా పోలీసులు తెలిపారు. వీరు ప్రయాణిస్తున్న బైక్ ట్యాంక్ కవర్‌లో కిలో గంజాయితో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి బ్యాగ్‌లో మరో కిలో గంజాయిని పోలీసులు గుర్తించారు. అరకు ఏజెన్సీ ప్రాంతం నుంచి వారు గంజాయిని కొనుగోలు చేసి తెస్తున్నట్టు తెలిపారు. వీరు ప్రయాణిస్తున్న పల్సర్ బైక్ దొంగిలించబడిందని, దీనిపై దుంబ్రిగుడ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదై ఉందని ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. నిందితుల నుంచి బైక్, గంజాయి, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులపై అభ్యంతరాల స్వీకరణ


ఈవీఎం గోదామును పరిశీలించిన డీఆర్వో సత్యనారాయణరావు, పార్టీల ప్రతినిధులు

తుమ్మపాల: ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై అభ్యంతరాలు, పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యన్నారాయణరావు రాజకీయ పార్టీల నేతలకు సూచించారు. ఓటర్ జాబితాపై నెలవారి సమావేశాల్లో భాగంగా కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు కొత్తగా ఓటరు నమోదు కొరకు, ఓటురు తొలగింపునకు, ఓటరు ఐడీ కార్డు సవరణల కోసం 1,354 దరఖాస్తులు నమోదయ్యాయన్నారు. వీటిలో 820 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని డీఆర్వో రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూలమైన సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. అంతకుముందు ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు వాసునాయుడు, అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (అనకాపల్లి), పి.నాగేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, కె.హరినాథబాబు, జి.గున్నబాబు, తుట్టా రమణ, పి.దుర్గారావు, గంటా సూరిబాబు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పిక్కల గొడౌన్ల ఆకస్మిక తనిఖీలు

రూ.23వేలపైగా జరిమానా


పన్ను కట్టని జీడి పిక్కలకు జరిమానా విధిస్తున్న నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భువనేశ్వరి

నాతవరం: జీడిపిక్కలు గొడౌన్లపై రెండో రోజు కూడా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మర్రిపాలెం పంచాయతీ శివారు మొక్లాంగులపాలెం, వల్సంపేట పంచాయతీలో మంగళవారం నర్సీపట్నం మార్కెట్ కమిటీ కార్యదర్శి భువనేశ్వరి ఆధ్వర్యంలో రెవెన్యూ పోలీసు అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి భువనేశ్వరి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నాతవరం మండలంలో రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో జీడి పిక్కలు గొడౌన్లపై ఆకస్మికంగా తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. మంగళవారం నిర్వహించిన దాడిలో మొక్లాంగులపాలెంలో మార్కెట్ పన్ను చెల్లించని 20 క్వింటాళ్లపైగా జీడి పిక్కలు దొరికాయన్నారు. నిబంధనల మేరకు మార్కెట్ పన్నులు రూ.23వేలకు పైగా జరిమానా విధించామన్నారు. ఇక మీదట నియోజకవర్గం నాలుగు మండలాల్లో దాడులు నిర్వహించి నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లనే విద్యార్థినిపై లైంగికదాడి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిపై లెక్చరర్ శ్రీధర్ పాల్పడిన లైంగిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, బాలాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా చట్టాలను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయకపోవడం వల్లే ఇటువంటి లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ సంఘటనకు కారణమైన లెక్చరర్ జి.శ్రీధర్‌ని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న కాలేజీలోనే ఇటువంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. లైంగికదాడి జరిగి మూడు రోజులైనా నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాధితురాలు మైనర్ బాలిక కాబట్టి ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి పోక్సో చట్టం ప్రకారం శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపకార్యదర్శి గౌతం,జిల్లా గర్ల్స్ కన్వీనర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కొక్కిరాపల్లిని డీ నోటిఫై చేయాలని కౌన్సిలర్ దీక్ష

- కూటమి ప్రభుత్వ జీవో ప్రకారం మళ్లీ పంచాయతీగా ప్రకటించాలని డిమాండ్
- చర్చనీయాంశమైన టీడీపీ కౌన్సిలర్ చర్య


దీక్షకు దిగిన కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 1378 ప్రకారం కొక్కిరాపల్లి గ్రామాన్ని యలమంచిలి మున్సిపాలిటీ నుంచి డీ నోటిఫై చేయాలన్న డిమాండ్‌తో అధికార టీడీపీకి చెందిన 23వ వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ మంగళవారం నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ప్రస్తుతం కౌన్సిల్ 'కూటమి' చేతిలో ఉన్న సమయంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేయాలన్న డిమాండ్‌తో టీడీపీ కౌన్సిలర్ దీక్షకు దిగడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీకి చెందిన నాయకులే.. జీవో అమలు చేయాలని దీక్షకు దిగడం గమనార్హం. మున్సిపాలిటీలో కూటమి నాయకులతో తీర్మానం చేయించడం కోసం ఇలా నిరవధిక నిరాహార దీక్ష చేయాల్సి రావడమేమిటని చర్చ సాగుతోంది.

రేపటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఆరిలోవ (విశాఖ): డీఎస్సీ–2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28 నుంచి జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ మంగళవారం తెలిపారు. ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి పరిశీలన ప్రారంభమవుతుందని, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం పాఠశాలలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి కౌంటర్‌లో ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడితో పాటు డిప్యూటీ తహసీల్దార్ బృందం ఉంటుందన్నారు. అభ్యర్థుల కాల్ లెటర్లు https://apdsc.apcfss.in/ లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్లతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన వాటికి సంబంధించిన మూడు జతల జిరాక్స్ కాపీలు, 5 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని డీఈవో సూచించారు.

28 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనకాపల్లి: కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకూ విశాఖ కైలాసగిరి పోలీస్ మైదానంలో జరుగుతుందని ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28న హాల్ టికెట్ నెంబర్ 4001020 నుంచి 4152205 వరకూ, 29న హాల్ టికెట్ నెంబర్ 4152904 నుంచి 4275272 వరకూ, 30న హాల్ టికెట్ నెంబర్ 4276418 నుంచి 4507457 వరకూ అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. ఈ మూడు రోజుల్లో హాజరుకాని అభ్యర్థులు సెప్టెంబర్ 1వ తేదీన హాజరు కావాలని పేర్కొన్నారు.

కొత్త వ్యూహాలతో టైటాన్స్

- 29న తమిళ్ తలైవాస్‌తో ఆరంభ మ్యాచ్
- విశాఖలో ప్రో కబడ్డీ సందడి

విశాఖ స్పోర్ట్స్: ప్రో కబడ్డీ ప్రీమియర్ లీగ్(పీకేఎల్) 12వ సీజన్‌లో తలపడేందుకు తెలుగు టైటాన్స్ జట్టు విశాఖ చేరుకుంది. ఈ సీజన్ విశాఖ వేదికగానే ప్రారంభం కానుండటం విశేషం. ఈ నెల 29వ తేదీ రాత్రి 8 గంటలకు తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య జరిగే తొలి పోరుతో లీగ్ ఆరంభమవుతుంది. విశాఖలో తొలి దశ పోటీలు సెప్టెంబర్ 10వ తేదీతో ముగియనున్నాయి. గత సీజన్‌లో 1, 3, 5, 7, 9, 11లో నిలిచిన జట్లు గ్రూప్–బీలో ఉండగా, మిగిలిన ఆరు జట్లు గ్రూప్–ఏలో సీడింగ్ పొందాయి. 11వ సీజన్‌లో ఏడో స్థానంలో నిలిచిన టైటాన్స్ ఈసారి గ్రూప్–బీలో ఆడనుందని ఆ జట్టు సీఈవో త్రినాథ్ మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. లీగ్ దశలో ప్రతీ జట్టు మొత్తంగా 18 మ్యాచ్‌లను ఆడాల్సి ఉండగా, టైటాన్స్ జట్టు విశాఖలో ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఇక్కడ మొత్తం 28 మ్యాచ్‌లు జరగనున్నాయి. సమావేశంలో టైటాన్స్ చీఫ్ కోచ్ కృష్ణకుమార్ హుడా, కెప్టెన్ విజయ్ మాలిక్, వైస్ కెప్టెన్ శుభం షిండే పాల్గొన్నారు.

తెలుగు టైటాన్స్ సభ్యులు వీరే..

కెప్టెన్ (ఆల్‌రౌండర్) విజయ్ మాలిక్, వైస్ కెప్టెన్ (డిఫెండర్) శుభం షిండే, డిఫెండర్లు అజిత్, సాగర్, అంకిత్, దుహాన్, ఆమెన్, అమీర్, రాహుల్, ఆల్‌రౌండర్లు శంకర్, భరత్, గణేష్, రైడర్లు చేతన్, నితిన్, ప్రఫుల్, జై భగవాన్, మన్జీత్, ఆశీష్

కేంద్ర రక్షణ శాఖ మంత్రికి స్వాగతం



మహారాణిపేట: తూర్పు నౌకాదళంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ విశాఖ వచ్చారు. ఆయనకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.









మార్కెట్‌కు చవితి శోభ



కశింకోట సంతలో కొనుగోళ్ల సందడి



వినాయక విగ్రహాల కొనుగోలు

కశింకోట: వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలు చేసే భక్తులతో మంగళవారం అనకాపల్లి, కశింకోట, తుమ్మపాల, తదితర మార్కెట్లు కిటకిటలాడాయి. ఎటుచూసినా వినాయక ప్రతిమలు, పాలవెల్లిలు, పూజా సామగ్రి, ఫలాలు, పుష్పాలతో మార్కెట్లు అంతా కళకళలాడాయి. బుధవారం వినాయక చవితిని ఘనంగా జరిపేందుకు గ్రామస్తులు, మహిళలు వినాయక విగ్రహాలు, పత్రి, పూజా సామగ్రి, ఇతర సరంజామా కొనుగోలు చేశారు. మట్టి వినాయక ప్రతిమలనే ఎక్కువగా వ్యాపారులు విక్రయించారు. సైక్లోన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెచ్చిన సరకుల విక్రయాలు జరుగుతాయో.. లేదోనని భయపడ్డారు. సాయంత్రం నుంచి వర్షం తెరిపివ్వడంతో కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు.

నారుమడి యాజమాన్యం కీలకం



కశింకోటలో రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు

కశింకోట: వరిసాగులో నారుమడి యాజమాన్యం చాలా కీలకమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు అన్నారు. కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. వరినాట్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వరి నాట్లు వేసే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నారు చిగుళ్లను తుంచి నాటుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు, సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. యూరియాకు బదులు ఎకరాకు పొటాష్ 15 కిలోలు లేదా డీఏపీ 25 కిలోల ఎరువు ఉపయోగించవచ్చునన్నారు. పశుగ్రాసం సాగుకు యూరియా సరఫరా చేసే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు అవసరం



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటనారాయణతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

అనకాపల్లి: పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా అనకాపల్లి ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పోలీస్ స్టేషన్ ద్వారా మహిళల భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలన్నారు. పోక్సో యాక్టు, ర్యాగింగ్ నిరోధక చట్టం, ఈవ్‌టీజింగ్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో స్మార్ట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీలు ఈ.శ్రీనివాసులు, శ్రావణి, సీఐలు చంద్రశేఖర్, ఎం.వెంకటనారాయణ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం జంక్షన్‌లో మదర్ థెరిసా జయంతి మంగళవారం ఘనంగా జరిగింది. జంక్షన్‌లోని ఆమె విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు.





నిరుపేదలకు వస్త్రదానం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినం వేడుకలను పురస్కరించుకుని పార్టీ నాయకులు మంగళవారం విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ వైద్య విభాగం కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీ నరసింహరావు ఆధ్వర్యంలో గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ఘోషాఆస్పత్రిలో బాలింతలకు రొట్టెలు, పండ్లు, పార్కు సెంటర్ వద్ద నిరుపేదలకు చీరలు, దుప్పట్లను పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్‌రాజా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. గొలగాం గ్రామంలో పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దండ సిద్దార్థ ఆధ్వర్యంలో చిత వైద్య శిబిరం, నిరుపేదలకు వస్త్రాలు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. చర్చిలో పాస్టర్ ప్రభుదాస్, ప్రేమరాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



గవరపాలెంలో నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మలసాల కుమార్‌రాజా

- సుందర్యపేట వృద్ధాశ్రమంలో ఆ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బాధపు హరికృష్ణ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ పాల్గొన్నారు.



కశింకోటలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కరణం ధర్మశ్రీ

కశింకోట: స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాలులో పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు సీటిపల్లి దివాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించి రక్తదానం కూడా చేశారు. సుమారు 53 మంది పార్టీ నాయకులు రక్తదానం చేశారు. విశాఖ రోటరీ బ్లడ్ బ్యాంకు సిబ్బంది సేవలందించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, తదితరులు భరత్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్త దాతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.
















మట్టి ప్రతిమల పంపిణీ



మట్టి ప్రతిమలు అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్ శ్రీకాంత్

అనకాపల్లి టౌన్: స్థానిక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మంగళవారం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సిహెచ్.శ్రీకాంత్ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రవికుమార్, దస్తావేజు లేఖరులు గల్లా కొండలరావు, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు. డైట్ కళాశాలలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు మకిజాన్, జోషిత

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థులు స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. ఇటీవల ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన రెండో రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఈ స్కూలులో చదువుతున్న పి.మకిజాన్ రజత పతకం, డి.జోషిత అండర్-12 విభాగంలో రోడ్-3, రింక్ 5, 6 కేటగిరీల్లో బంగారు పతకాన్ని, రెండు రజత పతకాలను సాధించారు. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ వారితో పాటు కోచ్ కె.రవిని అభినందించారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-27, ఓ పాజిటివ్-39, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయంలో ఫోన్ నంబర్ 9703613706లో సంప్రదించవచ్చు.



